అతని మాటల్లో ఆందోళన గూడు కట్టుకుని వుండడం పసిగట్టకపోలేదు కమల. 'వచ్చీ రాగానే వాడు చెప్పడం, మీరేమో ఖంగారు పడడం...బాగానేవుంది వరస...' లేని విసుగుని తెచ్చి పెట్టుకుని అంది. వంటింట్లోకివెళ్లి, రెండు నిమిషాల్లో భర్తవద్దకు వచ్చింది, కాఫీ గ్లాసుతో.

'మీరింకా పాము గురించే ఆలోచిస్తూ కూచున్నారా యేవిటి... షర్టుకూడా విప్పలేదు. రాత్రంతా బస్సులో ప్రయాణం చేసి వచ్చారు..'

పండు సగం తిని, బిస్కెట్ ప్యాకెట్టు విప్పుతూ, 'నాన్నా... మరే... పేద్దపాము...' అన్నాడు గోపీ.

'కొండపక్కన యిల్లాయె యిది. పాములు రాకుండా వుంటాయా యేవిటి? వస్తుంటాయి పోతుంటాయి...కాఫీ తాగండి. చల్లారిపోతుంది.' ఆమె అతని పక్కన కూర్చుంది.

'తాగుతాగాని, పాముని చంపేశారా?' అడిగాడు మూర్తి. అతనిలో పుట్టిన అదురు యింకా తగ్గుముఖం పట్టినట్టు లేదు. కాఫీ తాగుతూ భార్యవంక చూశాడు, పాము కథ చెప్పమన్నట్టుగా.

'నిన్న సాయంకాలం దీపాలు పెట్టేవేళ ఎక్కడినుంచో వచ్చింది పాము. కొండవైపునుంచే అనుకుంటా మరి...'

'అది రావడం ఎవ్వరూ చూళ్లేదా?'

'నేనప్పుడు బాత్‌రూంలో వున్నాను. గోపీయేమో హాల్లో కూచుని ఆడుకుంటున్నాడు పక్కింటి పిల్లలతో. మన పాలమ్మాయి చూసిందట పాము రావడం. పాము పాముంటూ అది యిల్లదిరి పొయ్యేలా కేకలు పెట్టడంతో, ఆడుకుంటున్న పిల్లలు కూడా పాము పాముంటూ కేకలు పెట్టారు...'

'పక్కింటి బామ్మగారిచేత గోపీకి విభూది పెట్టించావా, వాడు దడుసుకున్నాడేమో!'

'వాడా! దడుసుకోవడమా! మీ కంటే వెయ్యిరెట్లు నయం...' మూర్తి మందహాసం చేశాడు – కొడుకుని చూసి. అయినా అతని అదురు మాత్రం పూర్తిగా తగ్గలేదు.

'అలాగే లెండి...అందులోనూ శుభకార్యానికి చేసిందే నిజమైన సహాయ మనుకోండి..'

రావు మాటలు మూర్తికి ఎంతో తృప్తినిచ్చాయి. తలమీది బరువుని తీసి కిందపెట్టినట్టు ఒక అనుభూతి కలిగింది. తాను రావుని పాముగా తలచుకుని భయపడిపోయినందుకు సిగ్గుపడ్డాడు.

'ఏవిటి, అంత దీక్షగా చూస్తునారు? ఆ ఫైలెవరిదేవిటి?' అడిగాడు రావు మాటవరసకి.

జవాబు చెప్పక తప్పలేదు. తడబడుతూ ఏదో చెప్పాడు మూర్తి.

'చూడండి మూర్తిగారూ... ఆ కంట్రాక్టరు నాకు తెలిసిన వాడే. చాలామంది కంట్రాక్టర్ల కంటె ఎంతో మంచివాడు. నిక్కచ్చి మనిషి. పని పూర్తి చేసి డబ్బడుగుతాడు. చేసేది వ్యాపారం. ఎంతమంచి వాడైనా లాభం లేంది సెట్టి వరద పోడుగదా...'

'అయితేబిల్లుపాసు చెయ్యమంటారా?' మీకు తృప్తి కలిగితేనే పాసు చెయ్యండి. అంతే కాని మొహమాటానికి పోయి పనిలో మాత్రం పొరపాటు చెయ్యకండి.'

రావు మీద సదభిప్రాయం కలిగింది మూర్తికి. అతను యింత మంచి వాడా? అతన్ని గురించి తాను విన్న కొన్ని విషయాలు వట్టి అబద్దాలేనా? అసూయకొద్దీ ఎవరైనా కల్పించిన విషయాలా అవి? అలా అనుకున్నాడు గాని, రావు మూర్తి కంటికి పాములా కనిపించాడు మళ్లీ, ఇంటర్వ్యూ గుర్తుకి వచ్చేసరికి.

ఆ తర్వాత ఎవరి పనిలో వాళ్ల మునిగిపొయ్యారు. సాయంకాల మయింది. ఇంటికి వెళ్లాలని సీట్లోంచి లేచాడు మూర్తి. అప్పటికే కొందరు సహోద్యోగులు వెళ్లిపొయ్యారు. ముఖం కడుక్కుని రావు తల దువ్వుకుంటు న్నాడు.

ఇంటికి బయలుదేరిన మూర్తి రావు సీటువద్ద ఆగి నవ్వుతూ 'ముస్తాబవుతున్నారు. ఎక్కడన్నా పార్టీయా?' అన్నాడు.

'పెళ్లి రిసెప్షన్'

